క్లుప్తంగా

కనులపండువగా కల్యాణం



కల్యాణం అనంతరం సీతారాములు, భూదేవి,శ్రీదేవితో వేంకటేశ్వరస్వామి

శిరివెళ్ల: వెంకటాపురం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం శ్రీ సీతా రాములు, శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాలు కనుల పండువగా జరిగాయి. ఆలయంలో ఏటా జ్యేష్ఠ మాసం పౌర్ణమి రోజున స్వామి కల్యాణాలు నిర్వహించడం ఆనవాయితీ. రామాలయం పౌరోహితుడు వసంతకుమార్ శర్మ శాస్త్రోక్తంగా స్వాముల వారి కల్యాణం జరిపించారు. అంతకు ముందు స్వాముల వారికి అభిషేకాలు నిర్వహించారు. వేడుక అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం చేశా. రాత్రి ఉత్సవమూర్తులను ఊరేగించారు. కల్యాణాన్ని తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

12న విత్తన మహోత్సవం

నంద్యాల (సెంట్రల్): ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 12వ తేదీన విత్తన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఏరువాక డాట్ కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ సరళమ్మ తెలిపారు. గుంటూరు లాం క్షేత్రంలోని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఇక్కడ ప్రధాన పంటలైన వరి, కంది, మినుము, పెసర, శనగ, వేరుశనగ తదితర విత్తనాలకు సంబంధించి పలు రకాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆసక్తి గల రైతులు పాల్గొనాలని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

దొర్నిపాడు ఏఓగా సునీత



దొర్నిపాడు: మండల వ్యవసాయాధికారిగా సునీత వెలుగోడు నుంచి బదిలీపై రానున్నట్లు అధికారిక వర్గాలు శనివారం తెలిపాయి. ఈమె గతంలో ఇక్కడ ఏఓగా పనిచేస్తూ ఓడీపై వెలుగోడుకు వెళ్లారు. రుద్రవరం మండలం ఏఓగా పనిచేస్తున్న శ్రీకృష్ణ ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం తిరిగి అదే మండలానికి బదిలీపై వెళ్లనున్నారు. ప్రస్తుతం ఏఓ సునీత వ్యక్తిగత సెలవుల్లో ఉన్న కారణంగా ఉయ్యాలవాడ ఏఓగా పనిచేస్తున్న రాజేంద్రను దొర్నిపాడుకు ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు తెలిసింది.


రెజర్లపై వేధింపులు తగదు

గోస్పాడు: క్రీడాకారుణిలపై లైంగిక వేధింపులు తగదని సీపీఐ మండల నాయకులు షేక్ జిలానీ, గోకారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చి ఆటగాళ్లపట్ల ఎంపీ అనుచితంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ఆయనను పార్లమెంట్ సభ్యత్వం తొలగించి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో క్రీడాకారులు ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు.

గిరిజనులపై దాడి దుర్మార్గం

నంద్యాల(అర్బన్): కొత్తపల్లి మండలం బలపాలతిప్ప గ్రామానికి చెందిన చెంచు గిరిజనులపై అదే గ్రామానికి చెందిన ఓ వర్గం దాడి చేయడం దుర్మార్గమని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఉషారాణి, వెంకటేష్‌నాయక్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి ఎంపిక



విద్యార్థి సాయి

ఆళ్లగడ్డ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఆళ్లగడ్డ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఆరుగురు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజు శనివారం తెలిపారు. పాఠశాలకు చెందిన ముక్కర నందిని, అప్సాన, షాజిద్, తస్లీమ్, సాయిభార్గవి, వంశీ ఎంపికైనట్లు చెప్పారు.

రుద్రవరం: మండల కేంద్రం సమీపంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన సాయి అనే 8వ తరగతి విద్యార్థి ఎన్ఎంఎంఎస్‌కు (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్) పథకానికి ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థికి ప్రభుత్వం 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు రూ.12వేల చొప్పున నాలుగేళ్ల పాటు అందజేస్తుందని చెప్పారు.

గోస్పాడు: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు 11 మంది ఎన్ఎంఎం స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్ తెలిపారు. శనివారం స్థానిక పాఠశాలలో ఆయన మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

ఆళ్లగడ్డ: పేదలకు సీఎం సహాయనిధి ఎంతో మేలు చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం రుద్రవరం మండలం బీరవోలు గ్రామానికి చెందిన దాసరి సుజాతకు మంజూరైన రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. గతేడాది భూషణం అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో సీఎం సహాయనిధి నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ఉన్నారు.

పచ్చదనం బుగ్గిపాలు

- అగ్నికి ఆహుతవుతున్న సామాజిక వనాలు
- పొలం గట్లకు నిప్పుతో విలువైన వృక్ష సంపద దగ్ధం
- పర్యవేక్షణ లేమితో పచ్చని చెట్లు బూడిద
- బోర్డుల ఏర్పాటుకే పరిమితమైన అటవీశాఖ అధికారులు



పొలం గట్లకు నిప్పు పెట్టడంతో దుర్వేసి బాట వద్ద కాలిపోయిన రావి చెట్లు

నంద్యాల (సెంట్రల్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్ష్యం నీరుగారిపోతుంది. సామాజిక వనాల పెంపకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో అటవీ, డ్వామా ఆధ్వర్యంలో రోడ్లకిరువైపులా మొక్కలు నాటారు. వాటిలో కొన్ని చనిపోగా మిగిలినవి ఏపుగా పెరిగి పచ్చదనం పంచుతున్నాయి. కాలుష్యాన్ని నివారించడంతో పాటు బాటసారులు, ప్రయాణికులకు నీడను పంచుతున్నాయి. అయితే పొలం గట్ల వెంట రైతులు నిప్పు పెట్టడంతో చెట్లు కాలి బూడిదవుతున్నా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

అనాలోచిత చర్యలతో అగ్గిపాలు..

నంద్యాల మండలం పోలూరు నుంచి గడిగరేవుల వరకు మిక్స్‌డ్ ప్లాంటేషన్‌లో భాగంగా 2018 జూన్ 6 నుంచి 10 మధ్య 2వేల మొక్కలు నాటారు. మొత్తం 5 కి.మీలో 9 లక్షలు వెచ్చించి వేప, రావి, కానుగ, పచ్చ సుంకేసుల మొక్కల్ని పెంచారు. రబీ సీజన్ ముగియటంతో రైతన్నలు సేద్యాలు చేసుకోవటంతో పాటు గట్ల వెంట ఉన్న చెత్తను నిర్మూలించేందుకు నిప్పు పెడుతున్నారు. ఎండాకాలం, అందులోనూ గాలి వాటంతో చక్కగా ఎదిగిన చెట్లు నిమిషాల్లో మాడి బూడిదవుతున్నాయి. నాటినప్పట్నుంచీ ఈ పరిస్థితి ఉండటంతో కొన్నిచోట్ల మొక్కల ఆనవాళ్లే లేకుండా పోయాయి. సుంకేసుల–మిడుతూరు మధ్య 2020–21 మధ్య నాటిన మొక్కలదీ ఇదే పరిస్థితి. కొన్నిచోట్ల ఏకంగా చెట్లను నరికి కలపను బహిరంగంగా తరలిస్తున్నా అడిగే నాథుడు లేడు.

ప్రకటనలకే పరిమితం..

సామాజిక వనాలలో నిప్పు రాజేసినా, చెట్లను తొలగించినా, నరికిన వారిపై ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం–204(4) ప్రకారం చర్యలు తీసుకుంటాం అంటూ అటవీశాఖాధికారులు పలుచోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. మొక్కలను నాటి ఎదిగే వరకు సంరక్షించిన అధికారులు, తరచుగా చేయాల్సిన పర్యవేక్షణని గాలికొదిలేశారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునే సరికి పచ్చదనం కనుమరుగవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి విలువైన వృక్ష సంపదను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



మిడుతూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన అటవీ చట్టం సూచిక

పచ్చదనాన్ని కాపాడాలి



నంద్యాల–నందికొట్కూరు దారిలో నేను తరచూ ప్రయాణిస్తుంటాను. దారి వెంట ఉన్న రావి చెట్ల కింద అక్కడక్కడా ఆగి బడలిక తీర్చుకుని వెళ్తుంటాను. గత రెండేళ్లుగా కొందరు నిర్లక్ష్యంగా నిప్పు పెట్టడంతో పదుల సంఖ్యలో చెట్లు బుగ్గి పాలయ్యాయి. ఇదిలా కొనసాగితే త్వరలోనే చెట్లన్నీ కనుమరుగవుతాయి.

– చేరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, బెలూం, కొలిమిగుండ్ల

నీరు లేక మొక్కలు బెట్ట పోతున్నాయి



రోళ్లపాడు–మిడుతూరు మధ్య నాటిన మొక్కల్లో పెరిగిన వాటిని రైతులు నిర్లక్ష్యంగా వ్యవహరించి అగ్నికి ఆహుతి చేస్తున్నారు. చిన్నగా ఉన్న మొక్కలు నీటి ఎద్దడికి గురై బెట్టపోతున్నాయి. మరో 10 రోజులు ఇలాగే ఎండ కాస్తే చనిపోయే ప్రమాదముంది. అధికారులు స్పందించాలి. – కట్టుబడి మౌలాలి, అలగనూరు, మిడుతూరు మండలం

పట్టణాన్ని శుభ్రంగా ఉంచుదాం

నంద్యాల(సిటీ): పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన కాల్వల్లో చెత్త వేయకూడదని స్థానికులకు సూచించారు.మార్కెట్‌లో మిగిలిన కూరగాయలు, ఆకు కూరలను డంప్‌యార్డులో ఉన్న వర్మీ కంపోస్టుకు తరలించాలని చెప్పారు.ఖాళీ స్థలాల యజమానులతో మాట్లాడి స్థలాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ రెడ్డి ఉన్నారు.

ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్



మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గోస్పాడు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామని దీబగుంట్ల వైద్యాధికారి డాక్టర్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పసురపాడు గ్రామంలో శనివారం వైద్య సేవలు నిర్వహించారు. నడవలేని స్థితిలో ఉన్న వారిని,హృదయ సంబంధ సర్జరీ జరిగిన పేషెంట్లను, మూత్ర పిండాల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



టి.లింగందిన్నెలో లక్ష్మీనరసింహ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం



ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు

రుద్రవరం: టి.లింగదిన్నెలో గ్రామంలో నూతన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో విగ్రహ,ధ్వజ ప్రతిష్ఠోత్సవాలు శనివారం ముగిశాయి. రెండు రోజుల పాటు వేద పండితులు ఆలయం వద్ద వివిధ రకాల పూజలు,హోమాలు జరిపించారు. చివరి రోజున ఉదయం సుప్రభాతం,విశ్వరూపం ,యంత్ర ప్రతిష్ఠ, బింబ(విగ్రహ) స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం వంటి కార్యక్రమాలు చేపట్టారు. వేడుకల్లో స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

జెన్ భాగీదారిలో భాగస్వాములవ్వండి

నంద్యాల(న్యూటౌన్): జెన్ భాగీదారి జీ20 ఎడ్యుకేషన్ వర్క్ గ్రూపులో అందరూ భాగస్వాములు కావాలని డీఈఓ అనురాధ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెన్ బాగిదారి ప్రదర్శన ఎఫ్ఎల్ఎన్ ఎగ్జిబిషన్ ముఖ్య ఉద్దేశం అక్షరాస్యత, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాలను అభివృద్ధి చేయడం. జిల్లాలోని ఎంఈఓలు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు జూన్ 15 వరకు జరిగే జెన్ భాగీదారి కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా ఫౌండేషన్ లిట్రసీ న్యూమరసీ, ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులు పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతి మండలం నుంచి బెస్ట్ ఆఫ్–3ని ఈనెల 6వ తేదీలోపు పాఠశాల మండల స్థాయి పోటీలు నిర్వహించాలని సూచించారు.

విద్యార్థులతో చేయించాల్సిన కృత్యాలు..

సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠశాల సంస్థితత మేళ, సాంకేతిక వినియోగం, ఎస్ఎంసీలతో తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు నిర్వహించడం , ఆడియో విజువల్స్, ఎయిడ్స్ ఉపయోగించి పునాది అభ్యాసన సంఖ్యాశాస్త్ర నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, కథలు చెప్పడం, కృత్యాలు నిర్వహించడం, రంగోళి వంటి కృత్యాలు చేయడం, సైకిల్ ర్యాలీ, ఉదయం 8గంటల్లోపు పిల్లలందరితో గ్రామాల్లో ఎఫ్ఎల్ఎన్‌పై ప్రభాతభేరి, క్విజ్, పద్యాలు, గోడమీద చిత్రాలు, వీధి నాటికలు, బుర్ర కథలు వంటివి ప్రదర్శించాలని ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



అల్లూరులో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ : జగనన్న లేఅవుట్‌లలోటిళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ రవికుమార్ హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని అల్లూరు గ్రామ జగనన్న లేఅవుట్ కాలనీలో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. కాలనీలో 12 మంది లబ్ధిదారులు వుండగా, కోలా లలితమ్మ, వడ్ల మంజుల నిర్మాణాలు ప్రారంభించారు. వీరికి బేస్‌మట్టం బిల్లు సోమవారం జియో ట్యాగింగ్ ద్వారా నమోదు చేస్తామని హౌసింగ్ ఏఈ నాగరాజు తెలిపారు. ఉయ్యాలవాడ, ఆర్. పాంపల్లె, సర్వాయిపల్లె, ఇంజేడు గ్రామాల్లో నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ సూచించారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌రహీమ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ షాదిక్ బాషా, ఇంజినీరింగ్ అసిస్టెంటు రవితేజ, వీఆర్ఓ దస్తగిరి పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా 'జగనన్న విద్యా కానుక'



యూనిఫాం నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ : 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం రోజున జగనన్న విద్యా కానుకల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విడతల వారీగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న కానుకలను స్థానిక మోడల్‌స్కూల్‌లో నిల్వ చేస్తున్నారు. మండలంలో 1– 10వ తరగతి వరకు 2,517 మంది విద్యార్థులకు 25,485 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, ఇప్పటి వరకు మూడు విడతలుగా 14,590 వివిధ రకాల పాఠ్య పుస్తకాలు వచ్చాయి. అలాగే 1,420 బెల్టులు, 158 డిక్షనరీలు, యూనిఫాం 2,183 జతలు వచ్చాయి. మిగిలిన ఆరు కానుకలు రాగానే వాటిని జగనన్న విద్యా కానుక కిట్లుగా తయారు చేసి ఆయా పాఠశాలలకు చేరవేస్తామని ఎంఈఓ అనురాధ శనివారం తెలిపారు.

భక్తులకు బ్యాటరీ వాహన సౌకర్యం

శ్రీశైలంటెంపుల్: మల్లన్న భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాలను శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఐదు వాహనాల్లో మూడు పంచమఠాల సందర్శనకు, మరో రెండు వాహనాలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి క్షేత్ర పరిధిలోని పలు ముఖ్య ప్రాంతాలకు నడుపబడుతున్నాయి. ఈ వాహనాల ద్వారా భక్తులు ఉచితంగా ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠం, మహిషాసుర మర్దిని ఆలయం, హేమారెడ్డి మల్లమ్మ మందిరం, దేవస్థాన గోశాల, బయలు వీరభద్రస్వామి ఆలయం, అంకాళమ్మ ఆలయాలను సందర్శించవచ్చు. అలాగే వృద్ధులకు, దివ్యాంగుల కోసం ఆర్టీసీ బస్టాండ్ నుంచి సీఆర్వో ఆఫీసు, గంగా–గౌరీ సదన్, మల్లికార్జున సదన్, క్యూకాంప్లెక్స్ వరకు ఈ వాహన సదుపాయం కల్పించబడుతుంది. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, స్వామి వారి ఆలయ ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు పి.మార్కండేయశాస్త్రి, ఈఈ వి.రామకృష్ణ, ఎం.నరసింహారెడ్డి, ఏఈవో హరిదాసు, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, ఏఈలు ప్రణయ్ పాల్గొన్నారు.

మాడవీధుల పరిశీలన..

దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం ఆలయ పశ్చిమ, ఉత్తర, తూర్పు మాడవీధులను పరిశీలించారు. మల్లన్న దర్శనానంతరం భక్తులు సేద తీరేందుకు, మాడవీధులలో జరుపబడే వాహనసేవలను భక్తులు వీక్షించేందుకు వీలుగా పశ్చిమ మాడవీధులో సుమారు రూ.కోటి వ్యయంతో చేపడుతున్న గ్యాలరీ నిర్మాణ వివరాలను తెలుసుకున్నారు. అలాగే ఉత్తర, తూర్పు మాడవీధుల్లో ప్రాకార కుడ్య శిల్పాలను పరిశీలించారు.



బ్యాటరీ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొట్టు

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు

దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. శనివారం శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

ప్రజారోగ్యాన్ని అశ్రద్ధ చేస్తే చర్యలు





రోగి నుంచి వివరాలు తెలుసుకుంటున్న , నాడు -నేడు పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల టౌన్ : ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. నంద్యాల సర్వజన ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే అధికారులు నేరుగా తన దృష్టికి తేవాలని, ప్రజారోగ్యం విషయంలో అశ్రద్ధ చేయొద్దని సూచించారు. అనంతరం ఆయన ఆసుపత్రిలోని అన్ని వార్డులను కలియతిరిగారు. వార్డుల్లో ప్రవేశించి చికిత్సల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. మాతా శిశు సంరక్షణ వార్డును పరిశీలించి అక్కడ అందుతున్న సేవలను గురించి ఆరా తీశారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ విభాగం పరిశీలించి రిపోర్టులు త్వరగా ఇచ్చేందుకు కృషి చేయాలని చెప్పారు. ఆసుపత్రికి కేటాయించిన సోలార్ సిస్టమ్‌ను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ, డయోగ్నోస్టిక్ కేంద్రాలు పరిశీలించి అత్యవసర సమయాల్లో ఉపయోగించే అన్నిరకాల మందులను ఏపీఎంఎస్ఐడీసీ నుంచి తెప్పించుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. సూపరింటెండెంట్ వరప్రసాద్, డాక్టర్ మహబూబ్ బాషా, ఆర్ఎంఓ హరి, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన

నంద్యాల: పట్టణంలోని ఎన్జీఓ కాలనీలోనున్న పురపాలక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తరగతి గదుల పనులను నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా పాఠశాలలు ప్రారంభమయ్యే సరికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మున్సిపల్ పార్కులోని ఆయూష్ యోగా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రముఖ యోగా గురువు కండే ఆనంద్ గురూజీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు శనివారం ఆయన తెలిపారు. ఉదయం 5.20 గంటలకు ఒక బ్యాచ్, రెండో బ్యాచ్ 6.30 గంటలకు ఉంటుందని చెప్పారు. సూర్యనమస్కారాలు, ఆసనాలు, వ్యాయామాలు, ప్రాణాయామం, క్రియలు నేర్పిస్తామన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తిగత శుభ్రతే ఆరోగ్యానికి రక్ష

నంద్యాల టౌన్ : వ్యక్తిగత శ్రుభతతో అనారోగ్యం దరిచేరదని, అంటురోగాలు ప్రబలే అవకాశం తగ్గుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అతిసారం ప్రబలకుండా వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. అతిసారంపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఈ నెల 5 నుంచి 17వ తేదీ వరకు అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు ఉచితంగా ఇచ్చి చికిత్స విధానం తెలియజేయాలని అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను, విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బందిని ఆదేశించారు. చికిత్స విధానంలో భాగంగా ఓఆర్ఎస్ కలిపిన నీటిని క్రమం తప్పకుండా తీసుకోవాలని, పాలిచ్చే తల్లులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు.

వన సంరక్షణతో పర్యావరణ రక్షణ

ఆళ్లగడ్డ: వన సంరక్షణపై అవగాహన పెంచుకోవడం ద్వారా పర్యావరణ రక్షణకు అవకాశం ఉంటుందని అటవీ అధికారి ముర్తుజావళి పేర్కొన్నారు. పర్యావరణ హిత జీవన శైలి మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం ఎగువ అహోబిలం సమీపంలోని చింతల్ బేస్ క్యాంపు సమీపంలో యాత్రికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అటవీ అధికారులు, సిబ్బంది, యాత్రికులు ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయస్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు చేపట్టారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ఐఎంఏ సభ్యుడు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, మత్తుమందు వైద్య నిపుణుడిగా విశేష సేవలందించిన డాక్టర్ పీసీ మాధన్న జ్ఞాపకార్థం ఎస్బీఐ కాలనీలోని ఎంఆర్ ఆసుపత్రిలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 300 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు అభినందించారు. డాక్టర్లు జఫరుల్లా, సహదేవుడు, శివప్రసాద్, మౌళితేజ, ఉషారాణి, నిర్మలరాణి, ప్రశాంత్, ప్రణతి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు

చాగలమర్రి: స్థానిక చెరువు కట్టపై వెలసిన దస్తగిరి స్వామి ఉరుసును పట్టణ వాసులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉరుసు కమిటీ సభ్యులు స్వామి వారికి ఊరేగింపుగా గంధం తీసుకొచ్చి సమర్పించారు. శెట్టివీడు గ్రామానికి చెందిన భక్తులు పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. ఎంపీపీ వీరభద్రుడు తమ కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో జూనియర్ ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఆదివారం సీనియర్ ఎద్దుల పోటీలుంటాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రశాంతంగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈఓ అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు సజావుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నంద్యాల జిల్లాలో 47 పరీక్ష కేంద్రాల్లో 2,168 విద్యార్థులకు గాను 1,557మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. మూడు పరీక్షా కేంద్రాలను సందర్శించామని, జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, 14 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయని, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రెండు పరీక్ష కేంద్రాలను పరిశీలించారని వివరించారు.

క్రీడాకారులకు అభినందన

ఆళ్లగడ్డ: చెస్‌లో మరిన్ని పతకాలు సాధించి ఆళ్లగడ్డ పేరు ప్రతిష్టను పెంపొందించాలని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ స్థాయిలో ఫిడే రేటింగ్ సాధించిన ఆళ్లగడ్డకు చెందిన రిశ్విత్ బాయ్, అశ్రిత భారతి, జోషిత్ రెడ్డి, మనవిత్ నాయక్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఐకాన్ చెస్ అకాడమీ నిర్వాహకుడు ఇమామ్ హుసేన్, మామిళ్ల యుగంధర్, సోహన్ ఉన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి


నంద్యాల(న్యూటౌన్): మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్‌మెంట్ బెనిఫిట్ సౌకర్యాలను కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జీపుజాత కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక శ్రీనివాససెంటర్‌లో ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి తిరుమలరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. నంద్యాల మున్సిపాలిటీలో తొలగించిన 44మంది కార్మికులకు హైకోర్టు తీర్పు ప్రకారం 18 నెలల వేతనం చెల్లించాలని కోరారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, భాస్కరాచారి, తోటమద్దులు, కేఎండీ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



గణపతి పూజ నిర్వహిస్తున్న వేద పండితులు

ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయ ఆవరణలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శనివారం గణపతి పూజతో ప్రారంభించారు. వేద పండితులు వెల్లాల వెంకటశేషయ్య శర్మ, అవాంచి రామమోహన్‌శర్మ, ఇంద్రకంటి శశికాంతం శర్మ, మురళీధర్‌రావు ఆధ్వర్యంలో గంగపూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, కళశస్థాపన, నవగ్రహాలకు అంకురార్పన, జలాధివాసం, అగ్నిప్రతిష్ఠ, దీక్షాహోమం, మంగళహారతి పూజలు చేశారు. ప్రతిష్ఠ ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆదివారం వివిధ ప్రత్యేక పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



చదరంగం క్రీడాకారులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల